సాక్షి గ్రేటర్ వరంగల్

(హనుమకొండ - వరంగల్)

శనివారం । 5 । ఆగస్టు । 2023



భవిత బంగారం..

చదువును మధ్యలో మానేసిన వారికి ఓపెన్ స్కూల్‌లో చదువుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. దీంతో చాలా మందికి ఇది వరంగా మారింది. - 8లో▸



వీఆర్‌ఏల సర్దుబాటుకు కొత్త పోస్టులు

వీఆర్‌ఏల సర్దుబాటుకు ప్రభుత్వం అవసరమైన పోస్టులను మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. - 8లో▸



వాతావరణం

జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండగా ఉంటుంది. సాయంత్రం చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఉత్సాహంగా అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు



వరంగల్ స్పోర్ట్స్: హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో శుక్రవారం నిర్వహించిన హనుమకొండ, వరంగల్ జిల్లాల స్థాయి అండర్-14,16,18,20 ఎంపిక పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. బాల బాలికలకు జావెలిన్‌త్రో, 100, 400 మీటర్ల పరుగులో మొత్తం 450 మంది పాల్గొన్నారని అథ్లెటిక్స్ సంఘం వరంగల్ జిల్లా కార్యదర్శి యుగంధర్‌రెడ్డి తెలిపారు. ఇందులో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు ఈనెల 7న జేఎన్ఎస్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. డీఎస్‌ఏ అథ్లెటిక్స్ కోచ్ శ్రీమన్నారాయణ, పీఈటీలు వాసుదేవరావు, గ్రేసీకుమారి తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-3 అభ్యర్థులకు ఉచిత శిక్షణ

న్యూశాయంపేట: గ్రూప్-3 పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అర్హులైన మైనారిటీ నిరుద్యోగ యువతకు రాష్ట్ర ప్రభుత్వం మైనారిటీల సంక్షేమశాఖ, మైనారిటీస్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో రెండు నెలలు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు హనుమకొండ జిల్లా మైనారిటీల సంక్షేమాధికారి మేన శ్రీను తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈనెల 6లోగా దరఖాస్తులను జిల్లా మైనారిటీ కార్యాలయంలో అందచేయాలని కోరారు. ఇతర వివరాలకు సుబేదారి కలెక్టరేట్ కాంప్లెక్స్ కార్యాలయంలో.. లేదా 73309 90322 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

నేడు టీపీటీఎఫ్ నిరసన ప్రదర్శన

విద్యారణ్యపురి: పెండింగ్ జీపీఎఫ్ లోన్లు, పార్ట్‌ఫైనల్ పేమెంట్స్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ టీపీటీఎఫ్ హనుమకొండ, వరంగల్ జిల్లాల శాఖల ఆధ్వర్యంలో ఈనెల 5న సాయంత్రం 4.30 గంటలకు హనుమకొండ జెడ్పీ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన చేపట్టనున్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీపీటీఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు రఘుపతి, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ ప్రకటనలో కోరారు.

రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలి



హన్మకొండ: హనుమకొండలో ఈనెల 13న నిర్వహించే భారతీయ మజ్దూర్ సంఘ్ అనుబంధ తెలంగాణ రాష్ట్ర పవర్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలని యూనియన్ టీఎస్ ఎన్పీడీసీఎల్ శాఖ అధ్యక్షుడు ఆర్.రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం.శశికుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం హనుమకొండ అడ్వకేట్స్ కాలనీలోని యూనియన్ కార్యాలయంలో మహాసభల పోస్టర్‌లు ఆవిష్కరించారు. వేమనరెడ్డి, లక్ష్మణ్ నాయక్, మహేష్, వేణుమాధవ్, దామోదర్, చరణ్, సాదిక్ పాషా తదితరులు పాల్గొన్నారు.

10 నుంచి కేయూ బీటెక్ రెండో సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో బీటెక్ ఫస్టియర్ రెండో సెమిస్టర్ పరీక్షలు(రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూవ్‌మెంట్) ఈనెల 10న నిర్వహిస్తున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ రాధిక తెలిపారు. 10, 14, 16, 18, 21 తేదీల్లో మధ్యాహ్నం 2 నుంచి 5 వరకు పరీక్షలుంటాయన్నారు.

భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న గోవా మంత్రి



హన్మకొండ కల్చరల్ : శ్రీభద్రకాళి అమ్మవారిని శుక్రవారం గోవా రాష్ట్ర మంత్రి విశ్వజిత్ ప్రతాప్‌సింగ్‌రానే, ఆయన సతీమణి గోవా ఎమ్మెల్యే దేవికారానే దర్శించుకున్నారు. పూజల అనంతరం మంత్రి దంపతులను ఈఓ సత్కరించి అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు శ్రావణమాసం నాలుగు శుక్రవారాల్లో అమ్మవారి పూల అలంకరణ, ప్రసాద వితరణ, ఏడాది పాటు ప్రతి శుక్రవారం అమ్మవారి పూలదండల అలంకరణ నిమిత్తం నగదు చెల్లించారు. అలాగే ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్, బీజేపీ నాయకులు ఈగ మల్లేశం తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.


ఎన్నికల వేళ.. నిధుల గోల

నియోజకవర్గాల్లో సీడీపీ నిధుల గోల మొదలైంది. ఎన్నికల గడువు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిధులు విడుదల చేయడంతో ఎంతో కాలం నుంచి ఎదురుచూస్తున్న ద్వితీయ శ్రేణి నాయకులు తమ ప్రాంతాలకు కేటాయింపు చేసుకోవడానికి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల వద్ద పోటీ పడుతున్నారు. ఈ నిధులతో అసంపూర్తి పనులు పూర్తి చేసే అవకాశం ఉండడం, ఆ పనులు నామినేషన్, టెండర్ పద్ధతిన కేటాయించనుండడంతో ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

ఉమ్మడి జిల్లాకు రూ.45కోట్ల సీడీపీ నిధులు

- ఎమ్మెల్యేల కోటా కింద రూ.27 కోట్లు..
- ఎమ్మెల్సీల కోటా కింద మరో రూ.18 కోట్లు విడుదల
- పెండింగ్ పనుల పూర్తికి అవకాశం
- తమ ప్రాంతాలకు కేటాయింపు చేసుకోవడానికి ద్వితీయశ్రేణి నాయకుల పోటాపోటీ ప్రయత్నాలు





సాక్షిప్రతినిధి, వరంగల్: నియోజకవర్గం అభివృద్ధి కార్యక్రమం(సీడీపీ) కింద పనులు చేపట్టడానికి ఎట్టకేలకు నిధులు విడుదలయ్యాయి. కొంతకాలంగా జాప్యం జరిగినా.. ఎన్నికల గడువు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిధులు విడుదల చేసింది. అయితే ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్న నియోజకవర్గంలోని ద్వితీయ శ్రేణి నాయకులు ఈ నిధుల కోసం పోటాపోటీగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల వద్ద ప్రయత్నాలు చేస్తున్నారు. ఉమ్మడి వరంగల్‌లో 12 మంది శాసనసభ్యులు, ఎనిమిది మంది శాసనమండలి సభ్యులున్నారు. ఇందులో ఒకరు కాంగ్రెస్ పార్టీ(ములుగు) ఎమ్మెల్యే కాగా.. మిగతా వారంతా అధికార బీఆర్‌ఎస్ పార్టీకి చెందినవారే. కాగా ఒక్కో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీకి ఏటా రూ.3 కోట్లున్న సీడీపీ నిధులను 2021 నుంచి రూ.5 కోట్లకు పెంచారు. ఈ లెక్కన ఉమ్మడి వరంగల్‌కు ఏటా రూ.100 కోట్లు వస్తున్నాయి. అయితే ఆ నిధుల విడుదలలో కొంత కాలంగా జాప్యం జరుగుతోంది. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో సీడీపీ నిధులు విడుదల చేస్తూ మూడు రోజుల క్రితం ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం.. ఒక్కొక్కరికీ రూ.2.25 కోట్ల చొప్పున కేటాయించింది. ఈ మేరకు ఉమ్మడి వరంగల్‌లోని ఆరు జిల్లాలకు చెందిన సీపీఓ, డీటీఓ కార్యాలయాలకు నిధుల కేటాయింపునకు సంబంధించిన సమాచారం శుక్రవారం అందింది.

ఆశావహుల పోటాపోటీ

సీడీపీ నిధులకు సంబంధించి ఎమ్మెల్యేల కోటా కింద రూ.27 కోట్లు, ఎమ్మెల్సీలకు రూ.18 కోట్లు కలిపి.. ఉమ్మడి జిల్లాకు రూ.45 కోట్లు ఈ విడత విడుదలయ్యాయి. వీటికోసం ఎదురుచూస్తున్న నియోజకవర్గ ద్వితీయశ్రేణి నేతలు నిధులు వచ్చిన విషయం తెలియగానే హైదరాబాద్‌కు మకాం మార్చారు. ఎమ్మెల్యేలందరు కూడా అసెంబ్లీ సమావేశాల్లో ఉన్నందున అక్కడే వారిని కలిసి సీడీపీ నిధులలో తమ ప్రాంతాలకు వాటా కోరే పనిలో ఉన్నారు. ఈ నిధులు పొందడం ద్వారా ఎమ్మెల్యే వద్ద తమ ప్రాధాన్యతను కిందిస్థాయి కేడర్‌కు తెలియజేసే పనిలో ఈ నాయకులు ఉండగా.. నియోజకవర్గాల్లో సీడీపీ నిధుల గోల మొదలైంది. కాగా 2021 సంవత్సరంలో కరోనా నేపథ్యంలో ప్రజలకు మెరుగైన వైద్యం అందించడానికి సీడీపీ నిధులను కూడా ఖర్చు చేసిన విషయం తెలిసిందే. గతేడాది 'మన ఊరు-మన బడి' కోసం కేటాయించారు. ఈసారి ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో సీడీపీ కింద ఒక్కొక్కరికి రూ.2.25 కోట్లు కేటాయించగా.. ఈ నిధులను చాలాకాలంగా రూ.1 లక్ష నుంచి రూ.4 లక్షల వరకు వెచ్చిస్తే అసంపూర్తి పనులు పూర్తయ్యే అవకాశం ఉన్నవాటిపై దృష్టి సారించాలని ఎమ్మెల్యేలు నాయకులకు సూచిస్తున్నట్లు సమాచారం. సుమారు ఏడాది తర్వాత విడుదలైన నిధుల నుంచి తమ తమ ప్రాంతాల్లో పనులకు కేటాయించాలని కోరేందుకు వెళ్తున్న గ్రామ, మండల, జిల్లా స్థాయి నాయకులు పోటీ పడుతున్నారు. దీంతో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తమ నిధులను ఆచీతూచి ఖర్చు చేసే యోచనలో ఉన్నారు.

నిబంధనల మేరకే పనులు..

సీడీపీ నిధుల విడుదలతో నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులు వేగంగా సాగనున్నాయి. ఈ నిధుల వినియోగంలో మంత్రుల ఆమోదంతో పాటు పర్యవేక్షణ కూడా ఉండనుంది. ఉమ్మడి జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్‌లకు ఈ బాధ్యతలను రెండేళ్ల క్రితం అప్పగించారు. మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలు, రెండు ఎమ్మెల్సీ స్థానాలు కేటాయించగా, మంత్రి సత్యవతి రాథోడ్‌కు ఆమె ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్సీ స్థానంతో పాటు నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలు కేటాయించారు. విద్యావంతులు, ఉపాధ్యాయుల, ఎమ్మెల్యే, గవర్నర్ కోటాల కింద ఎంపికైన ఎమ్మెల్సీల నిధులు ఉమ్మడి వరంగల్‌లోనే ఖర్చు కానుండగా సీఎం పర్యవేక్షణలో కేటాయించనున్నారు. కాగా గతంలో చూపిన మార్గదర్శకాల మేరకే పనులు చేపట్టాలని నిధుల విడుదల ఉత్తర్వులో ప్రభుత్వం సూచించింది. దాదాపు సీడీఎఫ్ నిధులతో చేపట్టే పనులను కార్యకర్తలకు అప్పగించే అవకాశం ఉన్నందున, రూ.5 లక్షలు దాటిన పనులు కచ్చితంగా టెండర్ ద్వారా చేపట్టి.. రూ.5లక్షల లోపు పనులు నామినేషన్‌పై చేయవచ్చని వెసులుబాటు కల్పించింది.

మద్యం షాపుల టెండర్లు ఖరారు

- 2023-25 ఎక్సైజ్ పాలసీకి అనుగుణంగా దరఖాస్తుల స్వీకరణ
- ఈనెల 18వ తేదీ చివరి గడువు
- 21న అంబేడ్కర్ భవన్‌లో లక్కీ డ్రా
- ఎక్సైజ్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్ వెల్లడి



దరఖాస్తు స్వీకరిస్తున్న ఎక్సైజ్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్

కాజీపేట అర్బన్: రెండేళ్ల కాల పరిమితితో మద్యం షాపులకు టెండర్లను రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆబ్కారీ శాఖ ఖరారు చేసిందని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్ తెలిపారు. హనుమకొండ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. 2021-23 ఎక్సైజ్ పాలసీనే 2023-25 సంవత్సరానికి కొనసాగిస్తున్నామని, వరంగల్‌అర్బన్ పరిధి కాజీపేట, హనుమకొండ, ఖిలావరంగల్, వరంగల్ ఎక్సైజ్ స్టేషన్ల కింద 65 మద్యం షాపులకు గాను శుక్రవారం దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైందని చెప్పారు. ఈనెల 18 వరకు కలెక్టరేట్‌లో ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులను స్వీకరిస్తామన్నారు. వయసు 21 ఏళ్లు నిండిన వారు మద్యం షాపుల టెండర్లలో పాల్గొనేందుకు అర్హులని పేర్కొన్నారు. దరఖాస్తు ఫారంతో ఆధార్, పాన్‌కార్డ్, కుల ధ్రువీకరణ పత్రాల జిరాక్స్, మూడు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి పేరిట రూ.2లక్షల అప్లికేషన్ ఫీజు డీడీ లేదా చలాన్ జతపరచాలని అన్నారు. ఈ దరఖాస్తును హనుమకొండలోని ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో లేదా హైదరాబాద్‌లోని ఎక్సైజ్ కమిషనర్ కార్యాలయంలో అందజేయవచ్చని తెలిపారు. కుల ధ్రువీకరణ పత్రాన్ని ఈనెల 31వ తేదీ వరకు సమర్పించే అవకాశం కల్పించామన్నారు.

ఫీజు రూ.50 లక్షల నుంచి రూ.85 లక్షలు

ఎక్సైజ్ పాలసీలో భాగంగా వరంగల్ అర్బన్ పరిధి 65 వైన్‌షాపుల్లో 15 గౌడ కులస్తులకు, 10 ఎస్సీలకు, ఒకటి ఎస్టీలకు, మిగతా 39 ఓపెన్ కేటగిరీలో కేటాయించినట్లు వివరించారు. ఈనెల 21న హనుమకొండ అంబేడ్కర్ భవన్‌లో కలెక్టర్ ఆధ్వర్యంలో లక్కీ డ్రా ద్వారా వైన్‌షాపులను కేటాయించనున్నట్లు తెలిపారు. ఈ ఏడాది వరంగల్ అర్బన్ పరిధిలో రెండు వైన్‌షాపులకు రూ.50లక్షల లైసెన్స్‌ఫీజు, 11 షాపులకు రూ.55 లక్షలు, 52 షాపులకు రూ.85లక్షల లైసెన్స్ ఫీజులను ఖరారు చేసినట్లు చెప్పారు. ఎక్సైజ్‌పాలసీకి అనుగుణంగా ఒకవ్యక్తి ఎన్ని మద్యం షాపులకైనా దరఖాస్తు చేసుకోవడంతోపాటు ఎక్కడైనా సమర్పించవచ్చని పేర్కొన్నారు. మద్యం షాపులు దక్కించుకున్న వారు డిసెంబర్ 1 నుంచి నిర్వహణ ప్రారంభించవచ్చన్నారు. సమావేశంలో కాజీపేట, హనుమకొండ, వరంగల్, ఖిలావరంగల్ ఎక్సైజ్ సీఐలు చంద్రమోహన్, రామకృష్ణ, అంజిత్‌రావు, చంద్రమోహన్, నీరజ పాల్గొన్నారు.

రిజర్వేషన్లు ఇలా..

ఎస్సీలకు 10 షాపులు

జీడబ్ల్యూఎంసీ 12,14,19,21 డివిజన్ల పరిధి ఎల్బీనగర్(1), 3వ డివిజన్ ఆరేపల్లి(1), 18,41,42 డివిజన్ల పరిధి యాకుబ్‌పుర(1), 28,32,33,34,38,39,40 డివిజన్ల పరిధి ఉర్సుగుట్ట(2), 4,5,6,8,9,54 డివిజన్ల పరిధి కుమార్‌పల్లి(1), 7,10,30,50,51,52,57,59 డివిజన్ల పరిధి ఎక్సైజ్‌కాలనీ(1), పంథిని గ్రామానికి(1), వేలేరు(1), ముల్కనూర్(1).

ఎస్టీలకు ఒకటి..

7,10,30,50,51,52,57,59 డివిజన్ల పరిధి ఎక్సైజ్‌కాలనీ.

గౌడ కులస్తులకు 15..

18,41,42 డివిజన్ల పరిధి రంగశాయిపేట, శివనగర్(1), 28,32,33,34,38,39,40 డివిజన్ల పరిధి ఉర్సుగుట్ట(1), 4,5,6,8,9,54 డివిజన్ల పరిధి ఏనుగులగడ్డ, కాకతీయకాలనీ(1), 7,10,30,50,51, 52,57,59 పరిధి ఎక్సైజ్ కాలనీ, అడ్వకేట్స్‌కాలనీ(2), 53,56,58 డివిజన్ల పరిధి వడ్డేపల్లి(1), 49,60,61,62,63 డివిజన్ల పరిధి మెయిన్‌రోడ్డు కాజీపేట(1), ఎల్కతుర్తి(1), కమలాపూర్(2), శ్రీరాములపల్లి(1), వెంకటాపూర్(1), ముల్క నూర్ (1), కొత్తగూడ(1), నారాయణగిరి(1) ఉన్నాయి.

తొలిరోజు ఒకే దరఖాస్తు..

అర్బన్ పరిధి 65 మద్యం షాపుల టెండర్లలో భాగంగా శుక్రవారం తొలిరోజు ఎక్సైజ్ సూరింటెండెంట్ కార్యాలయానికి ఒక దరఖాస్తు వచ్చింది. దానిని సూపరింటెండెంట్ చంద్రశేఖర్ స్వీకరించారు.

వరంగల్ ఎక్సైజ్ పరిధిలో..

కరీమాబాద్ : వరంగల్ జిల్లాకు సంబంధించి 63 షాపులుండగా వాటిలో 14 గౌడ కులస్తులు, 6 ఎస్సీలు, 2 ఎస్టీలు, మిగిలిన 41 షాపులు జనరల్‌కు రిజర్వేషన్ చేసినట్లు వరంగల్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ లక్ష్మానాయక్ తెలిపారు.

ప్రభుత్వ పథకాల అమలు వేగవంతం చేయాలి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్

హన్మకొండ అర్బన్: జిల్లాలో ప్రభుత్వ పథకాల అమలు వేగవంతం చేయాలని హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో పథకాల అమలుతీరుపై సంబంధిత అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. పథకాల అమలులో జిల్లా నూరుశాతం ప్రగతి సాధించేలా కృషి చేయాలన్నారు. హరితహారంలో శాఖల వారీగా నిర్దేశించిన లక్ష్యాలను, అలాగే పంచాయతీరాజ్ శాఖ ద్వారా చేపట్టిన జీపీ భవన నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని చెప్పారు. బీపీఎల్ కుటుంబాలకు సంబంధించి ఇంటి స్థలాల కోసం వచ్చిన, జీఓ 58కింద వచ్చిన దరఖాస్తులను త్వరగా పరిశీలించాలన్నారు. జీఓ 59 కింద రెండో విడత డిమాండ్ నోటీసులు ఇవ్వాలని, డబ్బుల వసూలుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న సీఎంఆర్ పూర్తి చేయడంతో పాటు గొర్రెల అభివృద్ధి పథకం ద్వారా పంపిణీకి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ మహేందర్‌జీ, డీఎఫ్ఓ వసంత, డీఆర్‌డీఓ శ్రీనివాస్, డీపీఓ జగదీష్ పాల్గొన్నారు.

వరల్డ్‌క్లాస్ స్టేషన్‌గా కాజీపేట జంక్షన్

- 1904లో కాజీపేట రైల్వేస్టేషన్ ఏర్పాటు
- 1923లో కాజీపేట జంక్షన్‌గా..
- వచ్చే ఏడాది వరల్డ్‌క్లాస్ స్టేషన్‌గా గుర్తింపు
- 'అమృత్‌భారత్'తో అభివృద్ధి పనులు



ప్రస్తుతం కాజీపేట జంక్షన్



2024 వరల్డ్‌క్లాస్ జంక్షన్ నమూనా

కాజీపేట రూరల్: కేంద్ర ప్రభుత్వం అమృత్ భారత్ స్టేషన్ పథకం(ఏబీఎస్ఎస్)లో భాగంగా కాజీపేట జంక్షన్‌ను రీ డెవలప్‌మెంట్ చేయడానికి శ్రీకారం చుట్టింది. దేశవ్యాప్తంగా 508 రైల్వేస్టేషన్ల పునరాభివృద్ధికి ఈనెల 6న ఉదయం 9 గంటలకు ప్రధాని నరేంద్రమోదీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శంకుస్థాపన చేయనున్నారు. ఈ పథకం కింద మొదటి దశ కాజీపేట జంక్షన్‌కు రూ.24.45 కోట్ల నిధులు మంజూరైనట్లు రైల్వే అధికారులు తెలిపారు. 1890లో నిజాం స్టేట్ రైల్వే కంపెనీ లిమిటెడ్ కాజీపేట మీదుగా హైదరాబాద్-ఆదిలాబాద్ వరకు సరుకు రవాణా కోసం సింగిల్ లైన్‌ను నిర్మించింది. 1904లో అప్పటి నిజాం రైల్వే రేకుల షెడ్డుతో నిర్మించిన కాజీపేట రైల్వేస్టేషన్ దినదినాభివృద్ధి చెంది 1923లో కాజీపేట జంక్షన్‌గా మారి నేడు భారతీయ రైల్వేలో అతిప్రధాన రైల్వే స్టేషన్లలో ఒకటిగా పేరుగాంచింది. 119 సంవత్సరాల చరిత్ర కలిగిన కాజీపేట జంక్షన్‌ను వరల్డ్‌క్లాస్ స్టేషన్ జాబితాలో చేర్చి అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద అన్ని హంగులతో రీ డెవలప్‌మెంట్ చేయనున్నారు. దాదాపు మూడు జనరేషన్‌ల ప్రజలు కాజీపేట జంక్షన్‌ను రేకుల షెడ్డు నుంచి వరల్డ్‌క్లాస్ స్టేషన్ వరకు చూడబోతున్నారు. అన్ని విధాల సదుపాయాలు, సౌకర్యాలు కల్పించనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

రీ డెవలప్‌మెంట్‌లో చేసే పనులు ఇలా..

- రైల్వేస్టేషన్ బిల్డింగ్ ఎంట్రెన్స్ ఫోర్టికో
- 12 మీటర్ల వెడల్పుతో ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం
- ప్లాట్‌ఫాంల విస్తరణ
- అన్ని ప్లాట్‌ఫాంలపై కవర్డ్ షెడ్ల నిర్మాణం
- ఎగ్జిస్టింగ్ టాయ్‌లెట్స్, న్యూ టాయ్‌లెట్స్ బ్లాక్ నిర్మాణం
- వెయింటింగ్ హాల్ విస్తరణ
- సర్క్యులేటింగ్ ఏరియా విస్తరణ, స్మూత్ ట్రాఫిక్ ఫ్లో
- రెండు లిఫ్ట్‌లు, 3 ఎస్కలేటర్లు
- ప్యాసింజర్ ఫ్రెండ్లీ సైనసెస్ బోర్డుల ఏర్పాటు

ఎన్నికల నిర్వహణ ప్రణాళిక సిద్ధం చేయండి

గ్రేటర్ కమిషనర్, ఆర్వో షేక్ రిజ్వాన్‌బాషా



ఎన్నికల నిర్వహణపై అధికారులతో చర్చిస్తున్న కమిషనర్, ఆర్వో షేక్ రిజ్వాన్‌బాషా

వరంగల్ అర్బన్ : ఎన్నికల నిర్వహణ ప్రణాళిక (ఎలక్షన్ మేనేజ్‌మెంట్ ప్లాన్) సిద్ధం చేయాలని గ్రేటర్ వరంగల్ కమిషనర్, తూర్పు రిటర్నింగ్ ఆఫీసర్ షేక్ రిజ్వాన్ బాషా అధికారులను ఆదేశించారు. బల్దియా ప్రధాన కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఏఆర్వోలకు ఆయన మార్గనిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని మండలాల వారీగా ఓటర్ల జాబితా తయారు చేయాలని పేర్కొన్నారు. స్త్రీ, పురుషుల ఓటర్ల జాబితాను సిద్ధం చేసుకోవాలని, నియోజకవర్గ పరిధిలో 44 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించిన నేపథ్యంలో పోలీసు అధికారులతో సంప్రదించి నిర్ధారణ అనంతరం జాబితా సిద్ధం చేయాలని చెప్పారు. ఎన్నికల సెక్టోరియల్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి శిక్షణ ఇవ్వాలన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం 1,350 ఓట్ల కంటే ఎక్కువ ఉన్న పోలింగ్ కేంద్రాలను గుర్తించి అదనపు పోలింగ్ కేంద్రాలను గుర్తించి మౌలిక సదుపాయాలు కల్పించాలని ఏఆర్వోలను ఆదేశించారు. సమావేశంలో సెక్రటరీ విజయలక్ష్మి, తహసీల్దార్ నాగేశ్వర్‌రావు, ఎన్నికల డీటీ రవి పాల్గొన్నారు.

పీఎం స్వానిధిని సద్వినియోగం చేసుకోవాలి

వరంగల్ మహా నగర పరిధిలో ఉన్న వీధి వ్యాపారులు పీఎం స్వానిధి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్ మహా నగర పాలక సంస్థ చిరువ్యాపారుల ఆర్థిక స్వావలంబనకు కృషి చేస్తోందని పేర్కొన్నారు. బల్దియా ప్రధాన కార్యాలయ ఆవరణలోని మెప్మా కార్యాలయంలో ఈనెల 7న ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రత్యేక శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. లబ్ధిదారులు తమ వెంట ఆధార్‌కార్డు, ఓటర్ కార్డు, పాన్ కార్డు, వ్యక్తిగత బ్యాంకు పాసుబుక్, ఒక పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, వీధి వ్యాపారానికి సంబంధించిన ఫొటో తీసుకురావాలని సూచించారు. ఈ అవకాశాన్ని వీధి వ్యాపారులు వినియోగించుకోవాలని కోరారు.

నాలాల్లో పూడికతీతపై నిర్లక్ష్యం తగదు

నాలాల్లో పేరుకుపోయిన వ్యర్థాల తొలగింపులో ఏ మాత్రం నిర్లక్ష్యం చేయాకూడదని కమిషనర్ అధికారులను ఆదేశించారు. అండర్ రైల్వే గేట్ ప్రాంతంలోని సాకరాశికుంట నాలాలో జేసీబీలతో చేపట్టిన పూడికతీత పనులను కమిషనర్ తనిఖీ చేశారు. మున్నూరు కాపు సంఘం 39వ డివిజన్ డివిజన్ అధ్యక్షుడు ఇండ్ల రవి పలు సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. కమిషనర్ వెంట సీఎంహెచ్‌ఓ డాక్టర్ రాజేష్, శానిటరీ సూపర్‌వైజర్ మాదాసి సాంబయ్య, ఏఈ ముజామిల్ ఉన్నారు.

నేడు వరద ప్రభావిత ప్రాంతాల్లో మెరుపు సర్వే

- ఇంటింటికీ వెళ్లనున్న అధికారులు
- 1,750 ఇళ్లు.. 78 మంది అధికారులు
- సాయంత్రానికి తహసీల్దార్లకు నివేదిక

హన్మకొండ అర్బన్: ఇటీవల రికార్డు స్థాయిలో కురిసిన భారీ వర్షాలకు నగరం అతలాకుతలమైంది. అనేక ఇళ్లు, రోడ్లు, చెరువులు, కుంటలు దెబ్బతిన్నాయి. ఆస్తి, ప్రాణ నష్టం జరిగింది. ఈ నేపథ్యంలో నష్టం అంచనా వేయడంతో పాటు బాధితులకు తక్షణ సహాయం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా గ్రేటర్ వరంగల్ పరిధి హనుమకొండ జిల్లా వరద ప్రభావిత ప్రాంతాల్లో నష్టం అంచనా వేయడానికి శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు రెవెన్యూ, మున్సిపల్ యంత్రాంగం మెరుపు సర్వే చేపట్టేందుకు సిద్ధమైంది. ఈ మేరకు శుక్రవారం హనుమకొండ కలెక్టరేట్‌లో గ్రేటర్ వరంగల్ కమిషనర్.. అదనపు కలెక్టర్ మహేందర్‌జీ, ఆర్డీఓలు.. మున్సిపల్, రెవెన్యూ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సర్వేకు సంబంధించి దిశానిర్దేశం చేశారు. కేవలం వర్షాలకు దెబ్బతిన్న ఇళ్లు మాత్రమే కాకుండా వరద ప్రభావంతో ఇళ్లలో సామగ్రి, దినుసులు, పుస్తకాలు, బట్టలు వంటివి నష్టపోయినా పరిగణలోకి తీసుకోవాలని స్పష్టం చేశారు. బాధితుల గోడు వినాలని, అనుమానాలు, ఆరోపణలకు తావులేకుండా ప్రతిపాదనలు ఇవ్వాలని ఆదేశించారు. జిల్లాలో గ్రేటర్ పరిధిలో సుమారు 1,750 ఇళ్లు దెబ్బతిన్నట్లు ప్రాథమిక సమాచారం ఉందని, వాటిని స్వయంగా ప్రత్యేక బృందం పరిశీలించి ప్రత్యేకంగా రూపొందించిన ఫార్మాట్‌లో నివేదిక ఇవ్వాలని చెప్పారు. సర్వే ఉదయం ప్రారంభించి సాయంత్రానికి ముగించాలన్నారు. ప్రతి బృందంలో రెవెన్యూ శాఖ నుంచి ఆర్ఐ లేదా సీనియర్ అసిస్టెంట్, మున్సిపల్ శాఖ నుంచి బిల్‌కలెక్టర్ ఉంటారని తెలిపారు. మొత్తం 39 బృందాలు సర్వేలో పాల్గొంటాయని చెప్పారు. సమావేశంలో ఆర్డీఓలు రమేష్, విజయ్‌కుమార్, తహసీల్దార్లు గనిపాక రాజ్‌కుమార్, బావుసింగ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో గ్రేటర్ కమిషనర్, అదనపు కలెక్టర్, ఇతర అధికారులు

పాత వాహనాలు కొనేముందు జాగ్రత్తలు పాటించాలి

ఎంజీఎం : వ్యాపర్తులు పాత వాహనాలు కొనుగోలు చేసే ముందు జాగ్రత్తలు పాటించాలని నగర పోలీసు కమిషనర్ రంగనాథ్ అన్నారు. నగర పరిధిలో ద్విచక్రవాహనాల కట్టడిలో భాగంగా గతంలో ఎక్కువ శాతం అపహరణకు గురైన ఎంజీఎం ఆస్పత్రిలో పార్కింగ్ తీరును పరిశీలించారు. పరిసరాల్లో సీసీ కెమెరాల పనితీరును ఎంజీఎం ఆర్ఎంఓను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆటోనగర్‌కు చేరుకుని తుక్కు వాహనాల కొనుగోలు వ్యాపారస్తులతో మాట్లాడారు. ఆయన వెంట వరంగల్ ఏసీపీ కిషన్, ట్రాఫిక్ ఏసీపీ బోజరాజు, మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఎంజీఎంలో దొంగ పట్టివేత

ఎంజీఎం : ఎంజీఎం ఆస్పత్రికి వచ్చే రోగుల వద్ద చోరీకి పాల్పడుతున్న వ్యక్తిని శుక్రవారం సెక్యూరిటీ గార్డులు పట్టుకుని మట్టెవాడ పోలీసులకు అప్పగించారు. పెగడపల్లి డబ్బాలకు చెందిన శ్యామల రాజ్ కోటి రోగుల వద్ద చోరీ చేస్తుండగా సెక్యూరిటీ గార్డులు గుర్తించారు. సదరు దొంగ నుంచి రూ. 1800 నగదు తోపాటు ఒక సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని మట్టెవాడ పోలీసులకు అప్పగించారు.

ఇద్దరికి జరిమానా

వరంగల్ లీగల్: ఆత్మకూరు మండల కేంద్రానికి చెందిన నత్తి సుధాకర్‌పై దాడి చేసి గాయపర్చిన కేసులో అదే గ్రామానికి చెందిన ఇరువురు నేరస్తులు జన్ను సాంబయ్య, నత్తి దేవేందర్‌కు రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ హనుమకొండ జిల్లా సహాయ సెషన్స్ జడ్జి శ్రీనివాసులు శుక్రవారం తీర్పు వెల్లడించారు. 2019 జూన్ 7న మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడి ఎన్నిక తర్వాత రాత్రి 9 గంటల సమయంలో తన ద్విచక్ర వాహనంపై వస్తున్న నత్తి సుధాకర్‌ను హత్య చేయాలని నిందితులు క్రికెట్ వికెట్స్, రాడ్స్‌తో దాడి చేసి తీవ్రంగా గాయపర్చారు. జరిగిన ఘటనపై హత్యాయత్నం కింద కేసు నమోదు చేయగా విచారణలో సాక్ష్యాధారాలు పరిశీలించిన కోర్టు.. దాడి చేసి గాయపర్చిన నేరానికి ఇరువురు నేరస్తులకు శిక్ష విధించింది.

బావుపేట రైల్వేగేట్ నాలుగు రోజులు మూసివేత

కాజీపేట రూరల్: కాజీపేట సబ్‌డివిజన్ పరిధి హసన్‌పర్తి–ఉప్పల్ రైల్వేస్టేషన్‌ల మధ్య ఉన్న బావుపేట రైల్వేగేట్‌ను ఈనెల 7 నుంచి 10వ తేదీ వరకు మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు శుక్రవారం రాత్రి తెలిపారు. ఎమర్జెన్సీ రైల్వే లెవెల్ క్రాసింగ్ గేట్ రిపేర్, మూడవ రైల్వేలైన్ అభివృద్ధి పనుల కారణంగా బావుపేట నుంచి కమలాపూర్ గ్రామాలకు వెళ్లే(రోడ్ ట్రాఫిక్) 9వ నంబర్ ఇంజనీరింగ్ రైల్వే లెవెల్‌క్రాసింగ్ గేట్‌ను మూసివేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి వేరే మార్గం గుండా వెళ్లాలని సూచించారు.

జువైనల్ హోంకు 'ఒకరోజు' 11 మంది బాలురు

కాజీపేట: నిబంధనలకు విరుద్ధంగా ద్విచక్ర వాహనాలు నడుపుతూ పట్టుబడిన 11 మంది బాలురను జువైనల్ కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి ఆదేశం మేరకు శుక్రవారం ఒక రోజు జువైనల్ హోంకు పంపించినట్లు ట్రాఫిక్ సీఐ కె.సుజాత తెలిపారు. ఈ మేరకు కాజీపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. సీపీ రంగనాథ్ ఆదేశం మేరకు ప్రత్యేక తనిఖీలు నిర్వహించి బాలురను పట్టుకున్నట్లు వివరించారు.

భవిత బంగారం..

- ఓపెన్ టెన్త్, ఇంటర్‌తో ఉన్నత విద్యాభ్యాసం
- బడికి వెళ్లి మానేసిన, చదువుకోలేని వారికి అవకాశం
- ఈ నెల 10 వరకు అడ్మిషన్లు


అధ్యయన కేంద్రంలో తరగతులకు హాజరైన అభ్యాసకులు (ఫైల్)

నెక్కొండ: చదువుతోనే గౌరవం. చదువుంటే భవిత బంగారం. చదువును మళ్లీ కొనసాగిద్దాం.. సమాజంలో మనమూ గుర్తింపు పొందుదాం.. అనే నినాదాలతో రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ స్టేట్ ఓపెన్ స్కూల్ సొసైటీ (టాస్) ఆధ్వర్యంలో దూరవిద్యా విధానాన్ని ప్రోత్సహిస్తోంది. ఇందులో భాగంగా పని చేసుకుంటూనే సెలవు దినాల్లో ఓపెన్ పాఠశాలలో చదువుకోవచ్చు. దీంతో పని వృత్తుల వారు, డ్రైవింగ్ లైసెన్స్ అవసరమైన వారు, ప్రభుత్వ పథకాల్లో లబ్ధి పొందాలనుకునే ఓపెన్ స్కూల్ విద్య వైపు చూస్తున్నారు. ఇక్కడ చదువు పూర్తి చేస్తే రెగ్యులర్ సమాన సర్టిఫికెట్‌కు ప్రాధాన్యం ఉండడంతో ఓపెన్ స్కూల్‌లో చదివేందుకు చాలా మంది ముందుకొస్తున్నారు.

దరఖాస్తు విధానం..

పదో తరగతి చదివేందుకు ఎలాంటి విద్యార్హత అవసరం లేదు. 14 నుంచి 50 ఏళ్ల వయస్సు గలవారు దరఖాస్తు చేసుకోవచ్చు. వయస్సు నిర్ధారణ ధ్రువ పత్రం తహసీల్దార్ లేదా మున్సిపల్ అధికారులు జారీ చేసి ఉండాలి. మధ్యలో బడి మానేస్తే అప్పటి ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్ (టీసీ), ఆధార్‌కార్డుతో ప్రవేశం పొందొచ్చు. పదో తరగతి, ఇంటర్మీడియట్ 2023–24 విద్యా సంవత్సరంలో చేరే అభ్యాసకులు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా ఆగస్టు 10వ తేదీ వరకు చెల్లించొచ్చు. పదో తరగతి అడ్మిషన్ ఫీజు ఓసీలకు రూ.1550, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రూ. 1150, ఇంటర్‌లో అడ్మిషన్‌కు ఓసీలకు రూ. 1800, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు 1500 ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. అభ్యాసకులు www.teanfanoapenrchooorf ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించి రశీదును అధ్యయన కేంద్రాల్లో దరఖాస్తుతో సమర్పించాల్సి ఉంటుంది.

జిల్లాల వారీగా స్టడీ సెంటర్లు

హనుమకొండ	19
వరంగల్	21
జనగామ	15
మహబూబాబాద్	23
భూపాలపల్లి	14
ములుగు	13

అడ్మిషన్లు ఇలా...

సంవత్సరం	టెన్త్	ఇంటర్
2019-20	3181	3853
2020-21	4100	4441
2021-22	3337	4041
2022-23	2644	4346

వీరు అర్హులు

- చదువు మధ్యలో ఆపేసిన వారు, గృహిణులు, చదువుకు దూరమైన వారు సమీపంలోని ఓపెన్ కేంద్రాల్లో అడ్మిషన్ పొందొచ్చు.
- అర్హులు ఈ నెల 10వ తేదీ వరకు టీఎస్ ఆన్‌లైన్, ఏపీ ఆన్‌లైన్ ద్వారా, లేక మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకొని, ఆ రశీదును దగ్గరలోని అధ్యయన కేంద్రంలో సమర్పించాలి.
- ఓపెన్ స్కూల్‌లో ప్రవేశాలు పొందేవారు తరగతులకు హాజరు కావాల్సి ఉంటుంది. సమీపంలోని అధ్యయన కేంద్రాన్ని ఎన్నుకుంటే బాగుంటుంది.

ఓపెన్ విద్య వరం..

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 112 అధ్యయన కేంద్రాల్లో ఈ సార్వత్రిక (ఓపెన్ స్కూల్)ను ప్రభుత్వం కొనసాగిస్తోంది. ప్రభుత్వం 2008–09 విద్యా సంవత్సరంలో ఓపెన్ విద్యను ప్రవేశ పెట్టింది. అప్పట్లో కేవలం పదో తరగతి వరకు మాత్రమే అందుబాటులోకి తీసుకువచ్చారు. 2010–11లో ఇంటర్మీడియట్‌ను కూడా ప్రవేశపెట్టారు. చదువు మధ్యలో ఆపివేసిన వారికి ఈ ఓపెన్ విద్య వరంగా మారింది.

కనీస ఫీజుతోనే ప్రవేశాలు



రాష్ట్ర ప్రభుత్వం పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు కనీస ఫీజుతోనే అవకాశం కల్పిస్తోంది. ఓపెన్ విద్యలో పది, ఇంటర్ పూర్తి చేసుకున్న వారికి రెగ్యులర్ విద్యతో సమాన గుర్తింపు ఉంటుంది. ఉన్నత విద్య, పదోన్నతులు, ఉద్యోగాలు పొందడానికి, చదువు మధ్యలో మానేసిన వారికి ఎంతో ఉపయోగకరం. చదువుకోవాలనే ఆసక్తి ఉన్న వయోజనులు (అభ్యర్థులు) ఓపెన్ కేంద్రాల్లో చేరి సద్వినియోగం చేసుకోవాలి.

\- మురాల శంకర్‌రావు, ఉమ్మడి జిల్లా ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి


వ్యాపారులతో మాట్లాడుతున్న ఏసీపీ కిషన్

వరంగల్: వరంగల్ లక్ష్మీపురంలోని మోడల్ కూరగాయల మార్కెట్‌లో వారం రోజుల లోపు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని వరంగల్ ఏసీపీ బోనాల కిషన్ వ్యాపారులను ఆదేశించారు. మోడల్ మార్కెట్ గతేడాది ప్రారంభమైన సమయంలోనే అప్పటి ఏసీపీ గిరికుమార్, ఇంతేజార్‌గంజ్ సీఐ మల్లేష్.. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని పలుమార్లు చెప్పినా వ్యాపార సంఘం నేతలు పట్టించుకోలేదు. నెల రోజులుగా ప్రతి రోజూ ద్విచక్రవాహనాలు అపహరణకు గురికావడంతో బాధితులు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్నారు. ఒకే నెలలో ఇన్ని ద్విచక్రవాహనాలు చోరీ జరగడం వరంగల్ పోలీసు కమిషనర్ దృష్టికి వెళ్లింది. ఈవిషయంపై ఆయన ఆరా తీయగా పలుమార్లు స్థానిక పోలీసు అధికారులు చెప్పినా వ్యాపారులు పట్టించుకోవడం లేదని గుర్తించారు. దీంతో ఆయన స్వయంగా కూరగాయల మార్కెట్‌ను సందర్శించేందుకు శుక్రవారం సాయంత్రం వస్తునట్లు స్థానిక కార్పొరేటర్ చింతాకుల సునీల్‌కుమార్‌కు సమాచారం అందింది. ఇతర కారణాలతో సీపీ రంగనాథ్ మార్కెట్‌కు రాకపోవడంతో వరంగల్ ఏసీపీ బోనాల కిషన్, ఇంతేజార్‌గంజ్ సీఐ ముస్కే శ్రీనివాస్ మార్కెట్‌కు వచ్చి వ్యాపారులతో చర్చించారు. వారం రోజులుగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని లేకుంటే తామే దగ్గర ఉండి ఏర్పాటు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో మార్కెట్ వ్యాపార సంఘాల నాయకులు జారతి శ్రీనివాస్, బూర్గుల శ్రీను, పాటల రవి, బిట్ల కృష్ణ, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం


అగ్నికి ఆహుతైన పిండిగిర్ని

వరంగల్: వరంగల్ ఎల్‌బీనగర్ తిలక్‌రోడ్‌లోని కర్నె రాజేశ్వర్‌రావు ఇంట్లో విద్యుదాఘాతం సంభవించింది. ఈ ఘటనలో సుమారు రూ.3లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందని వరంగల్ అగ్నిమాపక కేంద్రం అధికారి ఏ.శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఉదయం రాజేశ్వర్‌రావు తల్లిదండ్రులు ఉంటున్న ఇంట్లో విద్యుదాఘాతం సంభవించి పొగలు రావడంతో స్థానికులు వృద్ధులను బయటకు తీసుకువచ్చారు. అనంతరం అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. అప్పటికే మంటల చెలరేగి ఇంట్లోని సామగ్రి దగ్ధమైంది. ఈ ఘటనలో తన స్టడీ సర్టిఫికెట్లు, ఆస్తి పత్రాలతో పాటు రూ.లక్ష, రూ.లక్షా 20వేల విలువైన బంగారం, రూ.50వేల విలువైన పిండిగిర్ని అగ్నికి ఆహుతైనట్లు రాజేశ్వర్‌రావు కుమారుడు లోకేష్ తెలిపారు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

ది స్వయంవర్ ఎథినిక్‌వేర్ షోరూం ప్రారంభం


షోరూం ప్రారంభించి రెడీమేడ్ డ్రెస్‌లను ప్రదర్శిస్తున్న ఆ సంస్థ చైర్మన్ కాసం శివప్రసాద్, మాంగళ్య షాపింగ్‌మాల్ చైర్మన్ నమశ్శివాయ

హన్మకొండ: హనుమకొండ నక్కలగుట్టలో నెలకొల్పిన ది స్వయంవర్ ఎథినిక్ వేర్‌ను శుక్రవారం ఆ సంస్థ వ్యవస్థాపకుడు, చైర్మన్ కాసం శివప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే ఈ షోరూం 79వదని తెలిపారు. ఈనెల 14న గుల్బర్గాలో 80వ షోరూం ప్రారంభించనున్నట్లు చెప్పారు. వివాహాది శుభకార్యాలకు, హల్దీ, ఎంగేజ్‌మెంట్, రిసెప్షన్, గృహ ప్రవేశం వంటి వేడుకలకు పురుషులకు సంబంధించిన అన్ని రెడీమేడ్ వస్త్రాలు తమ ప్రత్యేకత అని పేర్కొన్నారు. బ్లేజర్స్, సెల్వార్, కమీజ్, ప్యాన్సీ లాల్చీలు, ఆధునిక తలపాగాలు, పార్టీవేర్ చెప్పులు, సాక్స్, ముత్యాలదండలతో పాటు శుభకార్యాలకు పురుషులు ధరించే అన్ని ఒకేచోట లభించే వస్త్ర సముదాయం 'ది స్వయంవర్' అని అన్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో ఈ తరహాలో లభించే వాటికంటే ఎంతో నాణ్యమైన రెడీమేడ్ డ్రెస్‌లు, 30 నుంచి 40 శాతం తక్కువ ధరకు అందించడమే తమ ప్రత్యేకత అని వివరించారు. ఈ సందర్భంగా స్వయంవర్ నుంచి రెండు రకాల పర్‌ఫ్యూమ్స్‌ను ఆవిష్కరించారు. ఎలిగెన్స్, ఎంపవర్ అనే రెండు రకాలు మార్కెట్‌లో ఉన్న ధర కంటే 50 శాతం తక్కువకు రూ.999కే అందిస్తున్నామని చెప్పారు. పర్‌ఫ్యూమ్స్ వాడే వారు ఒక్కసారి తమ ఉత్పత్తి వినియోగిస్తే నిరంతరం వాడుతారన్నారు. కార్యక్రమంలో మాంగళ్య షాపింగ్‌మాల్ చైర్మన్ కాసం నమశ్శివాయ, కాసం మల్లికార్జున్, కాసం కేదారినాథ్, పి.ఎస్.మూర్తి, పుల్లూరు అరుణ్, ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్ త్రిపురనేని గోపీచంద్‌తో పాటు పురప్రముఖులు పాల్గొన్నారు.

ఆటోమేషన్ సేవలు వినియోగించుకోవాలి

- నిట్ ప్రొఫెసర్ ఆనంద్ కిశోర్
- పింగిళి కళాశాలలో జాతీయ సదస్సు

విద్యారణ్యపురి: లైబ్రరీల్లో ఆటోమేషన్ ద్వారా సేవలు వేగవంతమవుతాయని, డిజిటైలేజేషన్‌తో మెరుగైన సేవలు వినియోగించుకోవచ్చని వరంగల్ నిట్ ప్రొఫెసర్ కోల ఆనందకిశోర్ అన్నారు. శుక్రవారం హనుమకొండలోని ప్రభుత్వ పింగిళి మహిళా డిగ్రీ కళాశాలలో (అటానమస్) డిపార్ట్‌మెంట్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్, ఐక్యూఏసీ ఆధ్వర్యంలో రెండ్రోజులపాటు నిర్వహించే జాతీయ సదస్సు ప్రారంభ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గ్రంథాలయాలు నేటి సాంకేతిక యుగంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీని ఉపయోగించి ఆటోమేషన్ చేయాలన్నారు. నూతనంగా వస్తున్న టెక్నాలజీని వినియోగించుకుని ఎలాంటి ఖర్చులేకుండా డిజిటల్ లైబ్రరీ నిర్వహించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో పింగిళి ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ బి.చంద్రమౌళి, రీసోర్స్‌పర్సన్ బిస్వాల్ ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఖరగ్‌పూర్ హేమంత్‌కుమార్, ఆకళాశాల గ్రంథాలయ అధికారి జగదీశ్, ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్ డాక్టర్ సుహాసిని, పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ రామకృష్ణారెడ్డి, నిట్ ప్రొఫెసర్ డాక్టర్ వీరాంజనేయులు, కళాశాల అధ్యాపకులు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వరంగల్ నిట్ ప్రొఫెసర్ కోల ఆనందకిషోర్

వీఆర్‌ఏల సర్దుబాటుకు కొత్త పోస్టులు

- ఉమ్మడి జిల్లా పరిధిలో 1887 కేటాయింపు

హన్మకొండ అర్బన్: వీఆర్‌ఏల సదర్దుబాటు కోసం ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం వారికి అవసరమైన పోస్టులు, సూపర్ న్యూమరీ పోస్టులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి జిల్లా పరిధిలో మొత్తం వివిధ కేటగిరీల్లో 1887 పోస్టులు మంజూరయ్యాయి. వాటిలో వరంగల్ జిల్లాకు 312, హనుమకొండ 354, జనగామ 304, జయశంకర్ భూపాలపల్లి 288, మహబూబాబాద్ 287, ములుగుకు 242 ఉన్నాయి. ఆయా పోస్టుల్లో రెవెన్యూ శాఖలో జూనియర్ అసిస్టెంట్, ఆఫీస్ సబార్డినేట్, రికార్డ్ అసిస్టెంట్, చైన్‌మెన్, ఇరిగేషన్ విభాగంలో లష్కర్, హెల్పర్, మిషన్ భగీరథలో హెల్పర్, మున్సిపల్‌లో వార్డు ఆఫీసర్ పోస్టులు ఉన్నాయి. కాగా జిల్లాల్లో ఇప్పటికే వివిధ శాఖల్లో ఖాళీలను గుర్తించి సిద్ధం చేశారు. మొత్తంగా వీఆర్‌ఏల సదర్దుబాటుకు ఉన్న ఆటంకాలను ఒక్కొక్కటిగా ప్రభుత్వం తొలగిస్తోంది. ఇక వారసత్వ ఉద్యోగాలకు సంబంధించి కొంత స్పష్టత రావాల్సి ఉందని జిల్లా స్థాయి అధికారులు చెపుతున్నారు. దీనితోపాటు వీఆర్‌ఏల సర్టిఫికెట్లు, వివరాల పరిశీలన వేగంగా సాగుతోంది.

జిల్లాల వారీగా పోస్టుల మంజూరు వివరాలు

జిల్లా	రెవెన్యూలో జేఏ	రికార్డ్ అసిస్టెంట్	ఆఫీస్ సబార్డినేట్స్	చెన్‌మెన్	ఇరి గేషన్ లష్కర్	ఇరిగేషన్ హెల్పర్	మిషన్ భగీరథ హెల్పర్	మున్సిపల్ వార్డ్ ఆఫీసర్	మొత్తం
వరంగల్	51	46	-	11	89	27	66	22	312
హన్మకొండ	58	49	-	9	96	19	72	51	354
జనగామ	47	43	12	8	76	43	72	3	304
భూపాలపల్లి	49	40	3	9	80	39	66	2	288
మహబూబాబాద్	66	61	6	13	80	21	108	32	387
ములుగు	37	31	2	9	67	22	54	20	242

ఉద్యోగ నోటిఫికేషన్లలో ఈడబ్ల్యుఎస్ వర్గాలకు నష్టం

- డీసీసీబీ మాజీ చైర్మన్ జంగా రాఘవరెడ్డి


మీడియాతో మాట్లాడుతున్న జంగా రాఘవరెడ్డి

హన్మకొండ చౌరస్తా: ప్రభుత్వం జారీ చేస్తున్న ఉద్యోగ నోటిఫికేషన్లతో ఈడబ్ల్యుఎస్ వర్గాలు నష్టపోయే అవకాశం ఉందని, యువత మరో పదేళ్లు నిరుద్యోగులుగా మిగిలిపోయే కుట్రలు జరుగుతున్నాయని డీసీసీబీ మాజీ చైర్మన్ జంగా రాఘవరెడ్డి ఆరోపించారు. హనుమకొండ హంటర్‌రోడ్‌లోని తన కార్యాలయంలో శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రకటిస్తున్న ఉద్యోగ నోటిఫికేషన్లకు మధ్య రిజర్వేషన్ల వ్యత్యాసం పాటిస్తున్నదని, ఒక ఉద్యోగ ప్రకటనకు సంబంధించిన నోటిఫికేషన్ నిబంధనలు ఇంకొక ఉద్యోగానికి ఎందుకు వర్తించదని ప్రశ్నించారు. గ్రూప్–1 నోటిఫికేషన్‌లో పొందుపరిచిన రిజర్వేషన్ విధానం ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యుఎస్ వర్గాలకు గరిష్ఠ వయోపరిమితి 44, 45 సంవత్సరాలకు కల్పించిన ప్రభుత్వం, టెట్‌కు అదనంగా ఐదేళ్ల వయోపరిమితి ఇవ్వకుండానే ప్రకటన విడుదల చేసిందన్నారు. ఇప్పటికైనా సీఎం కేసీఆర్ కళ్లు తెరిచి నిరుద్యోగ యువతను మోసంచేయడం మానేయాలని, ఉద్యోగ నోటిఫికేషన్లను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

కార్మిక హక్కుల రక్షణకు పోరాడుదాం

- ట్రాన్స్‌పోర్ట్ యూనియన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఐలయ్య


ప్రధాని దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

వరంగల్ చౌరస్తా: ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ పరం చేయడాన్ని వ్యతిరేకిస్తూ, 44 కార్మిక చట్టాలను 4 కోడ్‌లుగా మార్చి, కార్మిక హక్కులను కేంద్ర ప్రభుత్వం హరిస్తోందని ట్రాన్స్‌పోర్ట్, మిల్ అండ్ హమాలీ వర్కర్స్ యూనియన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బైరబోయిన ఐలయ్య అన్నారు. మోదీ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ట్రాన్స్‌పోర్ట్, మిల్ అండ్ హమాలీ వర్కర్స్ యూనియన్ ఏఐఎఫ్‌టీయూ(న్యూ) ఆధ్వర్యంలో వరంగల్ జిల్లా కేంద్రంలోని పోస్టాఫీస్ సెంటర్‌లో శుక్రవారం కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో యూనియన్ అనుబంధం ఏఐఎఫ్‌టీయూ(న్యూ) నాయకులు చిక్కుల మొగిలి, నీలం తిరుపతి, శ్రీనివాస్, కృష్ణమూర్తి, వెంకటేశ్వర్లు, వెంకటాద్రి, కుల్ల చందర్, కుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పని కల్పిస్తే.. సున్నం పెట్టాడు

- రూ.2.50 లక్షల విలువైన దుస్తులతో పని మనిషి పరార్
- పోలీస్‌స్టేషన్‌లో బాధితుడి ఫిర్యాదు

హసన్‌పర్తి: అపరిచిత వ్యక్తిని పనిలో పెట్టుకుంటే చివరికి గోదాంనే లూటీ చేశాడు. ఈ ఘటన గురువారం అర్ధరాత్రి కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పరిమళ కాలనీలో జరిగింది. ఈ మేరకు బాధితుడు శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. నగరంలోని ప్రశాంత్‌నగర్‌కు చెంది న చక్రవర్తి హనుమకొండ టైలర్ స్ట్రీట్‌లో ఓ గార్మెంట్ (బట్టల)షాపు నిర్వహిస్తున్నాడు. అందుకు సంబంధించిన గోదాం పరిమళ కాలనీలో ఉంది. బ ట్టల షాపులో పనిచేయడానికి ఏపీలోని ఈస్ట్ గోదా వరి జిల్లా తాడిపల్లి గూడేనికి చెందిన సుబ్రహ్మణ్యాన్ని పనిలో కుదుర్చుకున్నాడు. రోజూ ఉదయం షాపుకు వెళ్లి రాత్రి గోదాం ముందు రూంలో వచ్చి నిద్రించే వాడు. రోజు మాదిరిగా సుబ్రహ్మణ్యాన్ని యజమాని రాత్రి గోదాం వద్ద వదిలి పెట్టాడు. శుక్రవారం ఉదయం గోదాం వద్దకు వచ్చిచూసే సరికి పని మనిషి కనిపించలేదు. ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్. గోదాంలో సుమారు రూ.2.50లక్షల స్టాక్ మాయమైనట్లు గుర్తించాడు. దీంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసుకుని దర్యా ప్తు చేస్తున్నట్లు ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు.

ఇంతేజార్ గంజ్ ఇన్‌స్పెక్టర్‌పై ఫిర్యాదు

హన్మకొండ: బీజేపీ కార్యకర్తలపై అకారణంగా దాడి చేసి తీవ్రంగా కొట్టిన వరంగల్ ఇంతేజార్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ ముస్క శ్రీనివాస్‌పై ఆ పార్టీ నాయకులు రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బీజేపీ లీగల్ సెల్ కన్వీనర్ క్రాంతి ఆధ్వర్యంలో రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనుగుల రాకేష్ రెడ్డి, బాధితులు ఏషబోయిన పురుషోత్తం, ఆలకుంట అనిల్ శుక్రవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ కార్యాలయంలో ఫిర్యాదు ఇచ్చారు. జూలై 29న వరంగల్ పోతన నగర్‌లో బీజేపీ కార్యకర్తలు ఏషబోయిన పురుషోత్తం, ఆలకుంట అనిల్‌పై ఇన్‌స్పెక్టర్ చేసిన దాడిని సీరియస్‌గా తీసుకున్న రాకేష్‌రెడ్డి ముందుగా వరంగల్ పోలీసు కమిషనర్ ఏవీ.రంగనాథ్‌కు ఫిర్యాదు చేశారు. సీపీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో సాక్ష్యాధారాలతో మానవహక్కుల కమిషన్‌ను ఆశ్రయించినట్లు రాకేష్‌రెడ్డి తెలిపారు. ఇన్‌స్పెక్టర్ ముస్క శ్రీనివాస్‌పై ప్రయివేట్ కేసు కూడా వేస్తామని, ఆయన సస్పెండ్ అయ్యే వరకు వదిలే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే వినయ్ భాస్కర్, రాష్ట్ర ప్రభుత్వం బీజేపీ కార్యకర్తలపై చేసిన దాడిని న్యాయబద్ధంగా ఎదుర్కొని బుద్ధి చెబుతామని పేర్కొన్నారు.

ఎన్టీఆర్ నగర్‌లో పేలిన బాక్స్

- వ్యక్తికి తీవ్రగాయాలు, నిమ్స్‌కు తరలింపు

వరంగల్ చౌరస్తా: వరంగల్ హంటర్‌రోడ్డు ఎన్టీఆర్ నగర్‌లో ఓ వ్యక్తి వరదలతో కొట్టుకొచ్చిన బాక్స్‌ను ఓపెన్ చేయగా అది పేలడంతో తీవ్ర గాయాలపాలైన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. హంటర్ రోడ్డు ఇటీవల కురిసిన వర్షాతో అతలాకుతలామైంది. ఇళ్లన్నీ నీటమునిగాయి. ఇప్పుడిప్పుడు వరదనీరు పోయి తేరుకుంటుంది. ఈ క్రమంలో భూక్య చంద్ర తన ఇంటిలోకి కొట్టుకొచ్చిన బాక్స్‌లో ఏముందో అని ఓపెన్ చేశాడు. దీంతో బాక్స్ పేలిపోయి పెద్ద శబ్దం వెలువడింది. దీంతో స్థానికులు భీతిల్లిపోగా, బాధితుడి కాళ్లకు పెద్ద ఎత్తున గాయాలయ్యాయి. అటుగా వెళ్లున్న ఫోర్త్ బెటాలియన్ పోలీసులు సమాచారం తెలుసుకొని సంఘటనా స్థలానికి చేరుకున్నారు. స్థానికులు బాధితుడిని వెంటనే ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా వైద్యుల సూచన మేరకు హైదరాబాద్ నిమ్స్‌కు తరలించారు. మట్టెవాడ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నారు.

దేవాలయాల్లో చోరీ..

- హుండీలు ధ్వంసం చేసి నగదు, బంగారం అపహరణ

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలంలోని రెండు ఆలయాల్లో గురువారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ఈ రెండు ఘటనలు ఒకేరోజు రాత్రి వేర్వేరు ప్రాంతాల్లోని రేణుక, ఎల్ల మ్మ ఆలయాల్లో జరిగాయి. హసన్‌పర్తి మండల కేంద్రంలోని రేణుక ఎల్లమ్మ ఆలయ ప్రధాన ద్వారం ధ్వంసం చేసి రూ.30వేల నగదుతోపాటు అమ్మవారి మెడలో ఉన్న రెండు స్నర తులాల బంగారు ఆభరణాలు అపహరించారు. సమాచారం అందుకున్న సీఐ గోపీ ఘటనా స్థలిని సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. శుక్రవారం ఆలయ కమిటీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

దేవన్నపేటలో...

దేవన్నపేటలో ప్రధాన రహదారిపై ఉన్న రేణుక–ఎల్లమ్మ ఆలయం తలుపులు ధ్వంసం చేసిన దుండగులు.. హుండీలో ఉన్న సుమారు రూ.50వేల నగదుతో పాటు అమ్మవారి మెడలో ఉన్న బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. శుక్రవారం ఆలయ కమిటీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

దారి దోపిడీకి పాల్పడిన వారిపై కేసు

రామన్నపేట/ఖిలా వరంగల్: ఓ వ్యక్తిని వెంబడించి దారిదోపిడీకి పాల్పడిన వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ ముస్క శ్రీనివాస్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..కరీంనగర్ జిల్లా వీణవంక మండలం ఎలబాకకు చెందిన ఆదెల్లి శ్రీనివాస్‌రెడ్డి వరినాట్లు వేయడానికి పశ్చిమ బెంగాల్ కూలీలు వచ్చారు. నాట్లు వేయటం పూర్తికాగానే తిరిగి కూలీలను రైలు ఎక్కించేందుకు గురువారం రాత్రి వరంగల్ రైల్వేస్టేషన్‌కు శ్రీనివాస్‌రెడ్డి తీసుకొచ్చాడు. శుక్రవారం తెల్లవారుజామున 2.30 గంటలకు కూలీలను మణుగూర్ ట్రెయిన్ ఎక్కించాడు. శ్రీనివాస్‌రెడ్డి తిరిగి బయటకు వచ్చి మూత్ర విసర్జన చేసేందుకు బస్టాండ్ వైపు వెళ్లాడు. అక్కడే మాటువేసిన నలుగురు శ్రీనివాస్‌రెడ్డిని పట్టుకొని అతడి జేబులోని రూ.40 వేలు నగదు, రెడ్‌మీ–5జీ మొబైల్ లాక్కొని బెదిరించి పంపించారు. భయాందోళనకు గురైన శ్రీనివాస్‌రెడ్డి తేరుకుని శుక్రవారం ఉదయం ఇంతేజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు.